# ఈదినాటకం

''అన్నా! మన ఊళ్లో బారతం జరిపిస్తా ఉండాం. వచ్చి ఒక నాలుగు దినాలు ఉండి పోరాదా?'' అని మా వెంకటరెడ్డి జాబు రాసె.

మా ఊళ్లో బారతం మాట యినే కుందికి నా మణుసు చిగిరించె!

మా బాశాలి మాట మణుసులో మెదిలే కుందికి వొగిరించె!!

మా ఊళ్లో బారతం ఒక ఎత్తయితే మా ఇంట్లో మాబాశాలి బారతం రొండెత్తులు. మొదులు పెడ్తే చాలు. నాన్‌స్టాప్ బస్సు మాదిర పోతానే ఉంటింది. ఆ దెబ్బతో అప్పుడప్పుడు చెంబుకు నామాలు పెట్టుకుందా మన్నెంత వైరాగ్గిం వద్దన్నా వచ్చేస్తింది. కొంచేపు ఉడకాడి పిస్తింది. మల్లా ఎట్టపోతిందో ఏం పాడో అయిపు లేకుండా పోతింది. అట్టగాకుండా వైరాగ్గిం వచ్చింది వచ్చినట్టే ఉండి పాయ్యేటట్టుగా ఉంటే మల్లా వాడే యదవన్నా సంసారం ఎట్టా చేస్తాళ్లే?

ఎప్పుడూ ఉండేదే మా బాశాలితో బారతం!!

ఏడాది కొకసారే మాఊళ్లో బారతం!!

అటుమంటప్పుడు చూడకుండా యిడ్సి పెట్టేదానికి అవితిందా?

అదే నా చిన్నప్పుడు మా ఊళ్లో బారతమంటే అది ఆడోళ్లకు కానీ మొగోళ్లకు కానీ కంటి మింద రెప్పట్టా పడేది లే. ఒంటి మింద గుడ్డ నిల్చేది లే. ఇంటింట్లో ఒక శుబకార్నెం జరగతా ఉంటే కూడా అంత ఉసారుండదేమో? అప్పిట్లో వాళ్ల కేమన్నా ఇప్పిటి మాదిర సిల్మాలు గిల్మాలు ఉణ్ణాయా? లేదే? అందుకే ఏడాదికి ఒక సారి ఆ పాయికట్లో ఉండే ఊళ్లన్ని చేత్తులు కలపతాయి. బారతం చేసుకోని కుశాల పడ్తాయి.

తోటి కంగాణి గాడు ఆ పాయికట్లో ఊరూరు తిరిగి పలానా దినం బారతం

కొండెక్కితిందని తండోరా కొడ్తాడు. కలగని మేలుకుణ్ణట్టు ఆ పాయికట్టు మేలుకుంటింది. సెలలు మెరవణికి ఎలబార్తాయి. సెలలంటే కొయ్యతో చెక్కి రంగేసిన పంచపాండవులు ద్రౌపితి పోతురాజుల యిగ్రహాలు. ఆ సెలలు ఒక్కొక్క యిల్లుగా ఊరంతా... ఒక్కొక్క ఊరుగా ఆ పాయికట్టంతా మెరవణి తిరగతాయి.

సెలలు మెరవణికి ఎలబార్తా ఉంటే రొండు పెద్ద తలకాయిలు గూడా ప్రయాణం కడ్తాయి. కంగుందికుప్పానికి పాయ్ ఈదినాటకం వాళ్లకు వక్కాకు పెట్టి సంచకారం కూడా కడ్తాయి. వస్తా వస్తా చిత్తూర్లో దిగతాయి. చిత్తూరికి ఆనుకొనే సంతపేట. సంతపేటలో పాగులు కత చెప్పే తిరువేంగడం పిళ్ల. ఆయనకు కూడా సంచకారం కట్టేస్తాయి.

సెలలు మెరవణి తిరిగేదంటే ఆ ఏడిక్కి ఎల కళ్లేము లే.

ఆపూట మిద్దాళ్లో సెలలు మెరవణి తిరగతాయనుకోండి. ఆ ఏడు సెలల్ను మోసే దానికి ఆ ఊళ్లో ఏడుమంది పచ్చి మంచినీళ్లు కూడా నోట్లో పాయ్‌కుండా ఉపోసం ఉంటారు. ఏడు బావల్లో మునిగేసి వస్తారు. ఏడుమంది ఏడు సెలల్ను ఎత్తి నెత్తిన పెట్టుకోని ఎలబార్తే–

పలకలు... పంబలు... దరువులు... ఆ దరువుకు తగినట్టుగా అడుగులు... కొమ్ములు... గెగ్గిరట్లు... పిల్లంగట్టెలు... కోలాటాలు... సెలలకు ముందుగా పోతా ఉంటే కుశాల కులకతా నడ్సినట్టుండేది.

సెలలు యింటింటి ముందర నిలబడ్తాయి. ఆయింట్లో వాళ్లు హారతిస్తారు. హారిత్తో గూడా ఆ యింటి దామాషా పకారం చెల్లించాల్సిన పంపకం చెల్లిస్తారు. ఇట్టా మాదిరి యిల్లిల్లూ తిరిగి పంపకం వసూలు చేస్తే మిద్దూర్లో మెరవణి అయ్‌పాయ్‌నట్టే!

ఆ మిందట ఆ సెలల్ను యింకొక ఊరికి మోసుకొని పోతారు. ఆడ ఆ ఊళ్లో వాళ్లు ఈ సెలల్ను అందుకుండేదానికి గెవిన్లోరడీగా కాసుకోని ఉంటారు. ఆ ఊళ్లో మెరవణి అయిపోతానే యింకొక ఊరు. ఇట్టా మాదిర సెలలు పాయికట్టంతా మెరవణి తిరిగేసి బారతంమిట్టన గుడిలోకి వస్తాయి!

లగ్గణం పకారం బారతం కొడెక్కితింది.

కొడి ఎక్కేదంటే పెనుమూరు పిల్లయ్యోరి శాతల మిందగా శాస్త్రపకారం పూజలు చెయ్‌పించి బారతాన్ని మొదులు పెట్టేదన్నమాట!

పాగులు కత చెప్పే తిరువేంగడం పిళ్ల. ఆయనతోగూడా ఊళ్లో కొందురు పెద్దోళ్లు. ఈళ్లను దర్మకర్తలంటారు. అందురు పొసుపు గుడ్డలు కట్టుకుంటారు. పిల్లయ్యోరు చెప్పే నట్టు యింటా చెప్పింది చేస్తా పూజలు జరపతావుంటే ఆదేముళ్లు సంతోస పణ్ణారో లేదో నాకు తెల్దు కానీ మా కుశాల మాత్రం గూటంకొండ కుప్పమింద నిలబడి కులికేది. కొడెక్కినాకపజ్జెనిమిది దినాలు ఆ పాయికట్నే పట్టేదానికి పగ్గాలుండవంటే యింక నామాదిరి చిన్న పిలకాయిల కత యేరేగా చెప్పాల్నా?–

ఆకర్నవాయిన లెక్కాశారంగా దినానికొక పర్వం లెక్కన పజ్జెనిమిది దినాలు

బారతాన్ని మద్దేణం నుంచి సందేళదాకా పాగులు కతగా చెప్పేస్తే కంగుందికుప్పం వాళ్లు రేత్రి పూట ఈదినాటకంగా ఆడేసేవాళ్లు!

చిత్తూరు జిల్లాలో పాగులు కత యాడ చెప్పాలన్నా తిరువేంగళం పిళ్ల చెప్పాల్సిందే! ఇంక ఈదినాటకం కుప్పంవాళ్లు ఆడాల్సిందే! కత చెప్పి చెప్పి ఆయనకు ఈదినాటకం ఆడిఆడి ఈళ్లకు బారతమంటే నీళ్ల తాగినట్టయ్ పొయ్యింది. మరీ ఆ తిరువేంగళం పిళ్ల పాగులు కత చెప్తావుంటే చిన్నపిలగోడు మొదులుకోని పెద్దోళ్లదాకా పండితుడు మొదులుకోని పామరుడి దాకా మడి చేతులు కట్టుకోని యినాల్సిందే!

అటుమంటిది యిప్పుడు బారతం ఎట్టజరగతా ఉండాదో? ఏంపాడో? వారా చూడాల్సిన పని ఉండాదా? లేదా? అందుకే యింట్లో మా బాశాలి బారతాన్ని కట్టకట్టి చంకలో పెట్టుకోని మా ఊరికి ఎలబార్నా.

నా మణుసంతా బారతంమిట్టన్నే చుట్టకలాడ్తా ఉంటే నేను మద్దేణ్ణం యాళకాడ మా ఊరి గుంటకట్ట మింద బస్సుదిగినా. వెంకటరెడ్డి యింటికి పోదామని ఎలబార్నా. వాడే పెళ్లాం పిలకాయిల్తోగూడా పాగులుకత యినేదానికి వస్తా ఉండి ఎదురుపడె. నన్ను చూసేకుందికి వాడికి ఏనిగి నెక్కినంత కుశాలేసె!

''అన్నా! ఈపొద్దు యిజయవాడ రేపు యిశాకపట్నం అంటా ఊళ్లు పట్టుకోని తిరగతా ఉండేవాడికి యాడ తీరుబాటు అవబోతిందిలే? ఆయనేడ రాబోతాళ్లే? అనుకుంటా ఉంటే వచ్చేస్తివి గదన్నా! మనం యిద్దురు పక్కనపక్కన కూసోని పాగులుకత యిని ఎన్నేండ్లు అయిపాయ. కొంచెం ఎచ్చుతక్కవగా నలబై ఏండ్లుకాలా?'' అనిఅంటావుంటే యింటికొచ్చిన కిష్టుణ్ణి చూసి విదురుడి మొకం ఎలిగినట్టు ఎలిగిపోతా ఉండాది వాడి మొకం!

కడుపులో పుట్నె కొడుక్కు లేదు. కట్టుకున్న పెండ్లానికి లేదు. ఈ అబిమానం అనేది కొనుక్కుంటే వచ్చేది కాదు. కోరితే దొరికేది కాదు. ఇది జలమ జల్మాల అనుబందమేవో? అని ఆలోచించుకుంటా ఉంటే-

''పదన్నా పద! యాళమించి పోతా ఉండాది. ఎప్పుడు ఎలబార్తివో ఏం పాడో? ఈ ఎర్రబస్సుల కత ఎవుడికి తెల్సు? అంత తినేసి కత యినేదానికి వస్తాం పద!'' అనె.

''పెనుమూర్లో పాండువాళ్ల యింట్లో తిన్నాన్రా!''

''చిన్నప్పుడు వాళ్లమ్మ ఎంత పిరంగా పిల్సి పిల్సి పెట్టేది గదన్నా. ఈపొద్దు పాండు గూడా దాన్ని మర్సిపోలేదంటే మెచ్చుకోవాల్సిందే!''

''పెనుమూర్లో దిగితే పాండును చూడకుండా వచ్చేదానికి లే. చూస్తే ఆ యింట్లో చెయ్యి కడక్కుండా వచ్చేదానికి లే. ఏందోరా ఈ రుణానుబందం? ఎట్ట తీర్సపోతానో ఏం పాడో? తెల్సిచావనంటా ఉండాది. మరీ ఈపొద్దయితే వాళ్లు పెట్టిన తిండి వాటి పేర్లుగూడా మనకు తెల్సిచావదు. నేను కూసోని తింటా ఉంటే వాళ్లమ్మ ఎట్టుండె మణిసి?

కుందనపు బొమ్మగదా? అటుమంటి తల్లి గువ్వ... గువ్వయి పొయ్యుండాది. నేను తింటావుంటే అతసేపు పక్కన్నే కూసోని 'తిన్రా నాయినా! తిన్రా బిడ్డా! ఈ సేతుల్తో పెట్టి ఎన్నేండ్లయిపాయరా? ఇంకొంచిం... యింకొంచిం యేసుకోరా!' అంటా ఉంటే నిజింగా నాకు కండ్లల్లో నీళ్ల తిరిగెరా!''

''యాడికి పొయ్‌నా నీ జాతకం అంతేకానీ నువ్వు పదన్నా!''

ఇద్దరు ఎలబారి పొయ్ బారతంమిట్టన కొటాయిలో కూసుంటిమి.

ఆ మహన్నబావుడెవుడో పేరెందుకు కానీ చెప్తా ఉండేది కతనా? కతకు పట్నె పీడనా? అది పొయ్ బారతం కతంట! ఎగర్తాడు... దుమకతాడు... ఉణ్ణెట్టుండి సిల్మా పాటలు పాడతాడు... ఏకపాత్రలు నటిస్తాడు. శానా గొప్పగా చెప్తా ఉణ్ణెట్టు పొంగిపోతా మాట మాటకు మెళ్లో పూలదండను సరిచేసుకుంటాడు. యాడ తిరువేంగడం పిళ్లె? యాడ ఈడు? హనుమంతుడి ముందర కుప్పి గంతులేసి నట్టుంటే నిజింగా నాకయితే ముండ్ల మింద కూసుణ్ణెట్టుండాది. అయినా నడిమద్దె లేసి వచ్చేస్తే బాగుండదనుకోని ఊపిరి బిగబట్టి కూసుణ్ణా. ఎత్తుబారం మొత్తుకోళ్ల నీ ఏడుపేందో నువ్వు ఏడ్సుకోరా నాతండ్రీ! అంటా నా ఓపిక్కు యింక మంగళం పాడెయ్యాల్సిందే అనుకుంటా ఉంటే నా బాద అర్తం చేసుకుణ్ణెట్టుగా అతగాడే మంగళం పాడేసె! బతుకు జీవుడా! అని బయట పడ్తిమి.

''ఏందిరా యిది వెంకట్రెడ్డీ?'' అంటే.

''ఇదంతా హైబ్రీడ్ సరుకులేన్నా!'' అనె.

పొద్దుగూట్లో పడ్తా ఉండాది. పొగులుకత యినేదాని కొచ్చినోళ్లు పొద్దుకల్లా చూసుకుంటా గబగబా నడస్తా ఉండారు. ఇండ్లకు పోవాల. అంత వండుకోవాల. తినేసి మల్లా ఈదినాటకం చూసేదానికి రావాలగదా? దూరాబారాన్నుండి వచ్చినోళ్లు మాత్రం ఎట్టా అంత సద్దికూడు తెచ్చుకోనుంటారు. తినేస్తారు. చాపో సంచి పట్టో పర్సుకోని ముందుగానే అంత చోటు రిజర్వేసన్ చేసుకుంటారు.

వెంకటరెడ్డితో గూడా ఆ సందేళకాడ బారతంమిట్టన తిరగదామని పోతే ఏం ఉండాదాడ? పేకాట ఆడేదానికి రొండు మూడు క్లబ్బులుండాయి. ఒక సారాయంగడి కూడా ఉండాది. తాగేవాళ్లు తాగతావుంటే... తూగేవాళ్లు తూగతా ఉండారు. ఇంకొక చోట మూడాకులు ఆట శానా ముంపు మింద ఉండాది. ఇంకొక చోటయితే లోపలా బైటా ఆడ్తా ఉండారు. స్కిల్‌గేమ్ కాడ సిలుకు జుబ్బాలు తళుక్ తళుక్ మంటావుండాయి.

''ఏందిరా యిది వెంకటరెడ్డీ?'' అంటే-

''ఏం చెయ్ మంటావన్నా? తలకాయికి చెప్పులడిగే పిలకాయిల్తో ఏం మాట్లాణ్ణా తప్పే!'' అనె.

అదే మా చిన్నప్పుడైతేనా? బారతంమిట్టంటే అదొక పుణ్ణెబూమిగా ఉండె. పెనుమూరు పాతగుంట యింకా దూరాబారాన్నుంచి గూడా యాపారస్తులు వస్తా ఉండ్రి.

అంగుళ్ల పెట్టుకోని యాపారం చేసుకుంటా ఉండ్రి. ఆడ నిలికిలేని యాపారం జరగతా ఉండె. సలింద్రాలు పెట్నోళ్లు... సంతర్పణలు చేసేవాళ్లు... ఎవుడికి తోచింది వాడొక మంచిపని చేస్తా ఉండె. ఎవుడైనా తప్పుదారి తొగేసొస్తే తప్పుకట్టాల్సి ఉండె. అటుమంటిది యిప్పుడు ఏమయిపాయ? చెడిపాయ. తీరుమానంగా చెడిపాయ!

ఆడ ఉండలేకుండా యిద్దరం యింటికాడికి పోతిమి. నన్ను చూస్తానే వాడింటామె పొగులు కతక్కూడా రాకుండా యింటికి తిరుక్కోని పాయ గదా? కోడికూరే కూడుగా తింటిమి. ఈది నాటకం చూస్తామని మల్లా జాము రేత్రిరి కాడ బారతం మిట్టకాడి కొస్తిమి.

ఆ యాళప్పుడు బారతం మిట్ట ఎట్లుండేది? ఇసికేస్తే రాలనంత జనంగా ఉండేది. ఈ పొద్దు ఈడ కొందురు ఆడ కొందురుగా ఉడ్డలుడ్డలుగా కూసోనుండారు.

ఎవురో పిల్లనాయాండ్లు. మొకాలకంత రంగు పూసుకోని ఎగర్తా ఉండారు. పాడే పాటకు ఏసే తాళానికి తీసేరాగానికి కట్టేఅడుక్కూ ఒక దానికొగిటి పొంతనే కుదర్లా?

''ఏందిది?'' అన్నెట్టుగా వెంకటరెడ్డి కల్లా చూస్తే ''యిప్పుడు బారతం అంటే క్లబ్బులు చీట్లాటే గదన్నా?'' అనె.

''రేత్రిం బొగుళ్ల యిట్లాడ్తా ఉండారే? పోలీసోళ్లు...''

''వాళ్లకు చెల్లించాల్సిన ముడుపు ముందుగానే చెల్లించేసి ఉండ్లా.''

''దీన్ని చూసేదానికేనా రా నువ్వు నన్ను రమ్మనింది?''

''అన్నా! యిట్టా మాదిర జరగతా ఉండాదని ఎంత మందికి తెల్సి ఏమి లాబం? అదే నీకు తెలిస్తే లోకానికంతా తెల్సినట్టే గదా?''

నా నోరు మూతపడె!

కండ్లు మూతలు పడ్తావుంటే పాయ్ పాణుకుంటిమి. తెల్లారింది. మా ఊళ్లో బారతం కత తెల్లారినట్టు! బారతం చూసింది ఆడికి చాలనుకోని బస్సెక్కినా. బస్సేమో పడ్తా లేస్తా ముందుకు. నా ఆలోచనలేమో ఒక్క మోపన ఎనక్కు!

ఆ కాలాన ఈది నాటకంలో అప్పోజీ ద్రౌపతి ఏసిం కట్నాడంటే- సలవద్దాలు ఏసుకుంటే మాత్రం ఏమిలే? వాడెమ్మా కడుపు మండ! కులికితే అందురు కులకాల! ఏడిస్తే అందురు యాడవాల! మరీ ఆ అద్దాల మునసామి చిన్న బిడ్డ గొంతెత్తి నారంటే యాణ్ణో మడులకాడ చేండ్ల కాడ కావిలికి పాయ్యుండే వాళ్లు మంచెల మింద పాణుకోని యినే వాళ్లంటే అప్పుడేమన్నా మైకులుణ్ణాయా పాడా? అర్జునుడు తవుసుమాను ఎక్కే నాడైతే బిడ్డలు లేనోళ్లు.. దెయ్యం పట్నోళ్లు... ఎంత మంది వచ్చి వరపడ్తా ఉండ్రి. ఆ అర్జునుడి ఏసింగట్టేటోడు ఎంత మడీ మట్టుగా ఉంటా వుండె!

కడాదినంలో అగ్గి తొక్కతారు. ఇప్పుడు చెప్తే దీన్ని ఎవురూ నిజిమని నమ్మరు. ఊరికొక బండి కట్టె. ఉరామరిగ్గా ఒక పదిపదైదు బండ్లు కట్టి ఉడ్డ పడ్తుంది. పొద్దట్టా వాల

పడ్తానే కుప్పకు నిప్పు పెట్తారు. సందేళ అయ్యేకుందికి నిప్పులు కణకణ మండతా ఉంటాయి. ఆ నిప్పుల్ను గుండంలో చదరకట్తారు. అగ్గి తొక్కతామని మొక్కుండే వాళ్లు ఆ పొద్దంతా ఉపోసం ఉంటారు. తిరువేంగడం పిల్లతో గూడా మూడు బావల్లో మునిగేసి వస్తారు.

తిరువేంగడం పిల్ల మంత్రాలు చదవతా ఆ గుండం చుట్టూ తిరగతా బారడు పొడుగు మల్లెపూల సరాన్ని ఆ అగ్గిమిందేసి ఎత్తతా ఉంటే ఒక్క పువ్వు వాడదే! అదే పక్కన నిలబడుకోని ఉండేటోడు ఆ అగ్గి సెగకు తట్టుకోలేకుండా తనకలాడ్తా ఉంటాడు. గోయిందులు పెట్తా తిరువేంగడం పిల్ల ముందుగా గుండంలోకి దూకితే పోలోమని అందురు ఎంటబడి దూకతారు.

మాతల్లి సాచ్చిగా చెప్తా ఉండా. చిన్నప్పుడు నేను గూడా అగ్గి తొక్కినా.

కాలుంటే వొట్టు!

తిరుపతిలో బస్సుదిగినా. ఆ పొద్దుటికి ఈ పొద్దుటికి ఎంత వెత్తాసం ఉండాదని ఆలోచించుకుంటా నాలుగ్కాళ్లమండపం కాడ వస్తావుండా.

ముత్తారెడ్డన్న ఎదురుపడె!

''ఏమిరా అబ్బోడా! అప్పుడు ఈది నాటకం ఆడ్తా ఉన్నోళ్లు యాడ ఆడినా హీరో ఏసిం కట్టేవాడు హీరో ఏసిమే కట్తావుండె. విలన్ ఏసిం కట్టేవాడు విలన్ ఏసిమే. ఆడేసిమేసే వాడు ఆడేసిమే. ఇప్పుడు మన మొనగాళ్లు ఉండారు గదా? వాళ్లట్టా గాదే? తెలుగు దేశిం వాళ్లు అయిద్రాబాద్‌లో హీరోలైతే డిల్లీలో విలన్లు. కాంగ్రెసోళ్లు డిల్లీలో హీరోలైతే అయిద్రాబాద్‌లో విలన్లు. ఇట్టా మాదిర ఏశాలు మార్సేదానికి ఈది నాటకం ఆడేవాళ్ల శాతయితిందా? ఈ నాటకాలు ముందర ఈది నాటకం ఏముండాది? ప్రెజలు ఈ నాటకాల్ను చూసే దానికి సరిపోతా వుంటే యింక ఈ జనాలు ఈది నాటకాలేం చూస్తార్రా?'' అనె.

అరెరెరె! ఈది నాటకం పుట్టు గతుల్లేకుండా పోనేపోతా వుండాదంటే ఈళ్ల పుణ్ణెమేనా? కదా మరి! ●